@netifocusnews @focustv www.netifocusnews.com
http://epaper.netifocusnews.com
TS-18-0006625

FOCUS TELUGU TV
అనునిత్యం - ప్రజాపక్షం

# నేటి ఫోకస్ న్యూస్

అను నిత్యం...ప్రజా పక్షం...

తెలుగు డిజిటల్ దినపత్రిక

ఎడిటర్: యం.తరుణ్ || తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రజల కోసం మా ఈ నేటి ఫోకస్ న్యూస్ తెలుగు డిజిటల్ దినపత్రిక || హైదరాబాద్ || మంగళవారం 16, జూలై 2024 || పేజీలు: 04



## డీఎస్సీ రద్దు కుదరదు..

- బీఆర్ఎస్ ప్రభుత్వంలో పేపర్ లీకేజీలతో తీవ్రంగా నష్టపోయిన విద్యార్థులు
- నిరుద్యోగులకు డిప్యూటీ సీఎం భట్టి విజ్ఞప్తి

2



## 'కాళేశ్వరం'లో మా పాత్రేం లేదు!

- ఉన్నతస్థాయి నిర్ణయాలనే అమలు చేశాం
- జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్‌కు ఐఏఎస్, రిటైర్డ్ ఐఏఎస్ అధికారుల వివరణ
- ఎస్కే జోషి, సోమేశ్, రామకృష్ణారావు, రజత్‌కుమార్, స్మితాసబర్వాల్ హాజరు

2

## రాజ్యసభలో తగ్గిన బీజేపీ బలం


బిల్లుల ఆమోదానికి ఎన్‌డీఏయేతర పార్టీల మద్దతు కీలకం!

నలుగురు నామినేటెడ్ ఎంపీలు పదవీ విరమణ

86కు పడిపోయిన కమలదళం సంఖ్య

న్యూఢిల్లీ, (నేటి ఫోకస్‌న్యూస్), జూలై 15:

కేంద్రంలో ముచ్చటగా మూడో సారి అధికారంలోకి వచ్చిన బీజేపీకి, రాజ్యసభలో మాత్రం మెజార్టీ తగ్గిపోయింది. నలుగురు నామినేటెడ్ ఎంపీలు పదవీ విరమణ చేయడం వల్ల కమలదళం సంఖ్యాబలం 86కు పడిపోయింది. మరికొన్ని రోజుల్లో మిగతా 2లో..



## రైతు రుణమాఫీకి మార్గమిదీ!



### అసలు, వడ్డీ కలిపి 2లక్షల రుణమాఫీ..

- వ్యవధి 2018 డిసెంబరు 12నుంచి 2023 డిసెంబరు 9
- లబ్ధిదారుల రుణ ఖాతాలకు నగదు బదిలీ పద్ధతిలో జమ
- 2 లక్షలకు మించి ఉంటే.. పైమొత్తాన్ని రైతులే చెల్లించాలి
- ఆ తర్వాత రుణ ఖాతాలకు రూ.2లక్షల మాఫీ నగదు బదిలీ
- యజమాని, భార్య/భర్త, పిల్లలు కలిపి కుటుంబంగా పరిగణన
- కుటుంబ సభ్యుల నిర్ధారణకు ఆహార భద్రత కార్డు ప్రామాణికం
- రుణ మొత్తం ఆధారంగా తక్కువ నుంచి ఎక్కువ మొత్తం మాఫీ
- రుణమాఫీ పథకం మార్గదర్శకాలను విడుదల చేసిన ప్రభుత్వం



హైదరాబాద్, (నేటి ఫోకస్ న్యూస్), జూలై 15:

అన్నదాతలు ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న రుణమాఫీ పథకానికి సంబంధించి మార్గదర్శకాలు విడుదలయ్యాయి. గతంలో చెప్పినట్లుగానే నిర్ణీత వ్యవధిలో తీసుకున్న అప్పు, వడ్డీ మొత్తం కలిపి కుటుంబానికి రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. రుణమాఫీ మొత్తాన్ని లబ్ధిదారుల రుణ ఖాతాలకు నగదు బదిలీ పద్ధతిలో జమ చేస్తామని పేర్కొంది. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల (పీఏసీఎస)లో అప్పు తీసుకున్న రైతుల రుణమాఫీ మొత్తాన్ని డీసీసీబీ (జిల్లా సహకార కేంద్ర బ్యాంకు) ఖాతాల్లో జమ చేస్తామని తెలిపింది. 2018 డిసెంబరు 12 నుంచి 2023 డిసెంబరు 9 నాటికి రైతుల పేరిట ఉన్న బకాయిలను మాఫీ చేస్తామని ప్రకటించింది. మిగతా 2లో..



## బీఆర్ఎస్ వికెట్ నంబర్ పది

- సీఎం రేవంత్ సమక్షంలో కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్న పటాన్‌చెరు ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి
- కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్, (నేటి ఫోకస్ న్యూస్), జూలై 15:

అధికార కాంగ్రెస్ పార్టీ ఎత్తులకు బీఆర్ఎస్ పార్టీ చిత్తవుతుంది. రాష్ట్రంలో కాంగ్రెస్ ఆపరేషన్ ఆకర్ష్ కొనసాగుతూనే ఉంది. పలువురు నేతలు ఒక్కరొక్కరుగా కారు దిగి, హస్తం గూటికి చేరుకుంటున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఘన విజయం సాధించిన హస్తం పార్టీ, ఆ తరువాత బీఆర్ఎస్‌ను ఖాళీ చేసే పనిలో పడింది. మిగతా 2లో..

## డ్రగ్స్ కేసులో రకుల్ సోదరుడు

- నైజీరియన్ గ్యాంగ్‌ను పట్టుకున్న యాంటీ నార్కోటిక్స్ టీమ్
- ఐదుగురికి పాజిటివ్..
- అరెస్టు చేసిన పోలీసులు..
- 199 గ్రాముల కొకైన్ స్వాధీనం
- ఇద్దరు సూత్రధారుల పరారీ

హైదరాబాద్, (నేటి ఫోకస్ న్యూస్), జూలై 15:

టాలీవుడ్‌లో మరోసారి డ్రగ్స్ కలకలం రేగింది. తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో (టీజీఏఎన్‌బీ), సైబరాబాద్ స్పెషల్ ఆపరేషన్ టీమ్ (ఎస్ఓటీ), రాజేంద్రనగర్ పోలీసులు చేపట్టిన ఉమ్మడి ఆపరేషన్‌లో ఐదుగురు డ్రగ్ పెడ్లర్స్ చిక్కారు. వీరి విచారణలో ప్రముఖ నటి రకుల్ ప్రీత్ సింగ్ సోదరుడు, టాలీవుడ్ నటుడు అమన్ ప్రీత్ సింగ్ సహా 13 మంది పేర్లు వెలుగులోకి వచ్చాయి. వీరిలో అమన్ మిగతా 2లో..







## సచివాలయ ముట్టడి ఉద్రిక్తం..

- ఏఐఎసఎఫ్, బీసీ సంఘాల నేతల అరెస్టు
- సెంట్రల్ లైబ్రరీలో నిరుద్యోగుల మెరుపు ధర్నా
- డీఎస్సీ వాయిదా వేయాలని ధర్నా

వివరాలు 02లో..

## ప్రభుత్వాన్ని కూల్చుతామంటే చూస్తూ ఊరుకోం

- మంత్రి పొన్నం ప్రభాకర్



వివరాలు 02లో..

# తగ్గిన బీజేపీ బలం

(మొదటి పేజీ తరువాయి..)

పార్లమెంట్ సమావేశాలు ప్రారంభం కానున్నాయి. పూర్తిస్థాయి బడ్జెట్‌తో పాటు మరికొన్ని కీలక బిల్లులను ప్రవేశపెట్టేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోన్న నేపథ్యంలో పెద్దల సభలో అధికార ఎన్‌డీఏ సంఖ్యాబలం తగ్గడం గమనార్హం. ప్రస్తుతం ఎగువసభలో ఎన్‌డీఏ కూటమి సంఖ్యాబలం 101గా ఉంది. ఇప్పుడు బిల్లును ఆమోదించడానికి బీజేపీకి ఎన్‌డీఏయేతర పార్టీలపై ఆధారపడాల్సిన పరిస్థితి వచ్చింది. రాకేశ్ సిన్హా, రామ్ షకల్, సోనాల్ మాన్‌సింగ్, మహేశ్ జఠ్మలానీ పదవీకాలం పూర్తయినందున గతవారం పదవీ విరమణ చేశారు. వీరిని నాన్ అలైన్డ్ సభ్యులుగా రాష్ట్రపతి నామినేట్ చేసినప్పటికీ ఆ తర్వాత మోదీ ప్రభుత్వానికి అధికారికంగా మద్దతు ప్రకటించారు. వీరి పదవీకాలం పూర్తవడం వల్ల ఇప్పుడు బీజేపీ సంఖ్యాబలం 86కు పడిపోగా, %చీణూ% కూటమికి బలం 101గా చేరింది. అటు ఇండియా కూటమికి 87మంది సభ్యుల మద్దతు ఉంది. 245మంది సభ్యులుండే రాజ్యసభలో ప్రస్తుతం 19 ఖాళీలు ఉన్నాయి. ప్రస్తుతం మొత్తం సభ్యుల సంఖ్య 226కు చేరింది. మెజార్టీ మార్క్ అయిన 114 కంటే ప్రస్తుతం ఎన్‌డీఏ సంఖ్యాబలం తక్కువగా ఉంది. ఏడుగురు నామినేటెడ్, ఇద్దరు స్వతంత్రుల మద్దతు అధికార పక్షానికి ఉన్నప్పటికీ వారితో కలిపినా మెజార్టీ మార్క్ దాటదు. అధికార పార్టీకి సంఖ్యాబలం తగ్గడం వల్ల, వచ్చే పార్లమెంట్ సమావేశాల్లో బిల్లులపై ఓటింగ్ అంశానికి ప్రాధాన్యం ఏర్పడింది. దీంతో బిజు జనతాదళ్, బీఆర్‌ఎస్ వంటి తటస్థ పార్టీలు కీలకంగా మారనున్నాయి. బిల్లులను ఆమోదించుకోవాలంటే స్వతంత్రులతో పాటు తటస్థ పార్టీల మద్దతు కేంద్రానికి అవసరం. రాజ్యసభలో బిజు జనతాదళ్ పార్టీకి 9మంది ఎంపీలుండగా, ఇటీవల జరిగిన పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లో వీరు ప్రతిపక్షం వైపు కూర్చోవడం గమనార్హం. అయితే, అన్నాడీఎంకే, వైకాపా మద్దతుతో బీజేపీ నెగ్గే అవకాశాలున్నాయని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. రాజ్యసభలో వైకాపాకు 11, అన్నాడీఎంకేకు నలుగురు ఎంపీలు ఉన్నారు. రాజ్యసభలో 19 ఖాళీల్లో నాలుగు జమ్ముకశ్మీర్ నుంచి, నాలుగు నామినేటెడ్ కేటగిరీలో ఉన్నాయి. మరో 8 రాష్ట్రాల నుంచి 11 స్థానాలు ఖాళీగా ఉన్నాయి. వీటికి త్వరలోనే ఎన్నికలు నిర్వహించే అవకాశాలున్నాయి. ఇందులో ఎన్‌డీఏకు 8, ఇండియా కూటమికి మూడు స్థానాలు దక్కుతాయి.

# డ్రగ్స్ కేసులో రకుల్ సోదరుడు

(మొదటి పేజీ తరువాయి..)

సహా ఐదుగురిని పరీక్షించగా, వారు డ్రగ్స్ వినియోగించినట్లు తేలింది. దీంతో ఈ ఐదుగురినీ నిందితులుగా చేర్చి అరెస్టు చేసినట్లు రాజేంద్రనగర్ డీసీపీ చింతమనేని శ్రీనివాస్ పేర్కొన్నారు. డ్రగ్ పెడ్లర్స్‌లో కొందరు స్థానికులూ ఉన్నారని, పరారీలో ఉన్న ఇద్దరు ప్రధాన సూత్రధారుల కోసం గాలిస్తున్నామని తెలిపారు. గచ్చిబౌలిలోని సైబరాబాద్ పోలీసు కమిష నరేట్‌లో ఆయన ఈ వివరాలను మీడియాకు వెల్లడించారు. నైజీరియాకు చెందిన డివైన్ ఎబుక సుజీ, ఫ్రాంక్లిన్‌లు బిజినెస్, స్టడీ వీసాలపై హైదరాబాద్‌కు వచ్చారు. కొన్నాళ్లు నగరంలోని పారామౌంట్‌కాలనీలో ఉన్నప్పటికీ ప్రస్తుతం ఢిల్లీలో నివాసం ఏర్పాటు చేసుకున్నారు. విదేశాల నుంచి కొకైన్ సహా వివిధ రకాలైన డ్రగ్స్ ఖరీదు చేస్తున్న వీళ్లు తమ ఏజెంట్ల ద్వారా దేశవ్యాప్తంగా అనేక మంది పెడ్లర్స్‌కు సరఫరా చేస్తున్నారు. నైజీరియా నుంచి వచ్చి బెంగళూరులో హోమ్ సర్వీస్ పని చేస్తున్న అనోహ బ్లెస్సింగ్ వీరికి ప్రధాన ఏజెంట్‌గా ఉంది. ఈమె హైదరాబాద్‌తో పాటు ఢిల్లీ, ముంబై, గోవాల్లో ఉన్న పెడ్లర్స్, సెల్లర్స్‌కు మాదకద్రవ్యాలు సరఫరా చేసింది. ఏడాదిన్నర కాలంలో 20 సార్లు నగరానికి మాదకద్రవ్యాలు తెచ్చింది. డ్రగ్స్‌ను హ్యాండ్‌బ్యాగ్‌లో పెట్టుకుని, విమానాలు, రైళ్లలో తిరుగుతూ సప్లై చేస్తుంటుంది. ఈ డ్రగ్స్‌ను నిజాం కాలేజీ విద్యార్థిగా ఉన్న నైజీరియన్ అజీజ్ నోహీమ్ అడెషోలా, బెంగళూరులో ఉంటూ ఓ కంపెనీకి లీడ్ కన్సల్టెంట్‌గా వ్యవహరిస్తున్న విశాఖ వాసి అల్లం సత్య వెంకట గౌతమ్, అమలాపురం నుంచి వచ్చి నగరంలో నివసిస్తున్న కారు డ్రైవర్ సనబోయిన వరుణ్ కుమార్, బండ్లగూడకు చెందిన ఈవెంట్స్ కొరియోగ్రాఫర్ మహ్మద్ మెహబూబ్ షరీఫ్‌లకు పంపిణీ చేస్తోంది. వీళ్లు తమ వినియోగదారులకు వీటిని విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు.

# 'కాళేశ్వరం'లో మా పాత్రేం లేదు!

హైదరాబాద్, (నేటి ఫోకస్ న్యూస్), జూలై 15:

కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం, అంచనాల సవరణ, టెండర్ల ప్రక్రియలో తమ పాత్రేమీ లేదని ఐఏఎస్, విశ్రాంత ఐఏఎస్ అధికారులు తెలిపారు. ప్రభుత్వం ఉన్నత స్థాయిలో తీసుకున్న నిర్ణయాలను మాత్రమే అమలు చేశామని స్పష్టం చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నిర్మాణాల్లో లోపాలు, అవకతవకలపై విచారణ జరుపుతున్న జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిషన్ ఎదుట సోమవారం పలువురు సీనియర్ ఐఏఎసలు, విశ్రాంత ఐఏఎసలు హాజరయ్యారు. మాజీ సీఎస్ శైలేంద్రకుమార్ జోషి (ఆన్‌లైన్‌లో), మాజీ సీఎస్ సోమేశ్‌కుమార్, నీటిపారుదల శాఖ మాజీ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రజత్‌కుమార్, ముఖ్యకార్యదర్శి వికాసరాజ్, నీటిపారుదల శాఖ ప్రస్తుత కార్యదర్శి రాహుల్ బొజ్జా, ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు, మాజీ సీఎం కేసీఆర్‌కు పదేళ్లు కార్యదర్శిగా పనిచేసిన స్మితా సబర్వాల్ విచారణకు హాజరై, వాద నలు వినిపించారు.

బ్యారేజీల నిర్మాణ ప్రాంతాల ఎంపిక, నిర్మాణంలో మీ పాత్ర ఏంటి? అని కమిషన్ ఆరా తీసింది. బ్యారేజీల నిర్మాణానికి పరిపాలనాపరమైన అనుమతులు, కాంట్రాక్టర్లకు పనులు అప్పగించిన తీరు, వారితో చేసుకున్న ఒప్పందాలు, వాటి అమలు, అంచనాల సవరణ, ఉల్లంఘనలు తదితర అంశాలపై వారిని ప్రశ్నించినట్లు సమాచారం. నీటిపారుదల శాఖ ఇంజనీర్లు, నిర్మాణ సంస్థల ప్రతినిధులను విచారించి, ఇప్పటికే సేకరించిన సమాచారం ఆధారంగా ఐఏఎస్, మాజీ ఐఏఎస్ అధికారులపై కమిషన్ ప్రశ్నల వర్షం కురిపించినట్లు సమాచారం. కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించిన ఆర్థికపరమైన అంశాలపైనా లోతుగా విచారించినట్లు సమాచారం. అంచనా వ్యయ ఆమోదం, పరిపాలనా అనుమతులు, సవరణ అంచనాలు, నిధుల విడుదల, కాళేశ్వరం ఇరిగేషన్ కార్పొరేషన్ ఏర్పాటుకు అనుమతులు, దాని ద్వారా రుణాలు సమీకరించిన తీరు తదితర అంశాలపై వారిని ప్రశ్నించినట్లు తెలిసింది. ఏ నిర్ణయం కూడా తాము తీసుకోలేదని, అన్నీ ఉన్నతస్థాయిలోనే జరిగాయని అధికారులు తెలిపినట్లు సమాచారం. ఉన్నతస్థాయిలో జరిగిన నిర్ణయాలనే అమలు చేశామని, బ్యారేజీల నిర్మాణం, వైఫల్యం, అంచనాల సవరణతో తమకెలాంటి ప్రత్యక్ష సంబంధాల్లేవని వారు వివరించినట్లు తెలిసింది. ఇక కమిషన్‌కు నివేదించిన అంశాలను అఫిడవిట్ల రూపంలో వారంలోగా సమర్పించాలని జస్టిస్ పీసీ ఘోష్ ఆదేశించారు. ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు రాష్ట్ర బడ్జెట్ ప్రతిపాదనల తయారీలో నిమగ్నమై ఉండడంతో ఆయనకు ఆగస్టు 5వరకు గడువు ఇచ్చారు. కాగా, విచారణకు పూర్తి సహకారం అందిస్తామని ఐఏ ఎస్‌లు, మాజీ ఐఏఎసలు స్పష్టం చేశారు.

# రైతు రుణమాఫీకి మార్గమిదీ!



(మొదటి పేజీ తరువాయి..)

కుటుంబ సభ్యుల నిర్ధారణకు ఆహార భద్రత (పీడీఎస్) కార్డును పరిగణనలోకి తీసుకోనున్నట్లు పేర్కొంది. రాష్ట్రంలో ఉన్న షెడ్యూల్డ్ వాణిజ్య బ్యాంకులు, ప్రాంతీయ, గ్రామీణ బ్యాంకులు, జిల్లా సహకార కేంద్ర బ్యాంకులు, వాటి శాఖల్లో తీసుకున్న స్వల్పకాలిక పంట రుణాలను మాఫీ చేయనున్నట్లు తెలిపింది. రుణమాఫీ మొత్తాన్ని ఆధారంగా చేసుకొని ఆరోహణ క్రమంలో (తక్కువ నుంచి ఎక్కువ) మాఫీ చేస్తామని పేర్కొంది. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పీఎం-కిసాన్ మినహాయింపులను రాష్ట్ర ప్రభుత్వం వద్ద ఉన్న డేటా మేరకు పరిగణనలోకి తీసుకుంటామని పేర్కొంది. ఈ మేరకు రుణమాఫీ పథకానికి సంబంధించిన మార్గదర్శకాలపై జీవో ఆర్టీ నంబరు 567ను రాష్ట్ర వ్యవసాయశాఖ కార్యదర్శి రఘునందన్‌రావు సోమవారం జారీ చేశారు.

**జీవోలో పేర్కొన్న వివరాలు..**

- రుణమాఫీ పథకం-2024 పరిధి, వర్తింపు ఇలా..
- తెలంగాణలో భూమి కలిగి ఉన్న ప్రతి రైతు కుటుంబానికీ రూ.2 లక్షల పంట రుణమాఫీ వర్తిస్తుంది. స్వల్పకాలిక పంట రుణాలకు ఈ పథకాన్ని వర్తింపజేస్తారు.
- రాష్ట్రంలో ఉన్న షెడ్యూల్డ్ వాణిజ్య బ్యాంకులు, ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు, జిల్లా సహకార కేంద్ర బ్యాంకులు(ఉమ్మడి బ్యాంకులు), వాటి శాఖ (బ్రాంచి)ల నుంచి రైతులు తీసుకున్న పంట రుణాలకు రుణమాఫీ పథకం వర్తిస్తుంది.
- 2018 డిసెంబరు 12 నుంచి 2023 డిసెంబరు 9వ తేదీ నాటికి మంజూరైన, రెన్యువల్ అయిన, రుణ బకాయిలకు వర్తిస్తుంది. బకాయి ఉన్న అసలు, వర్తించే వడ్డీ మొత్తం పథకానికి అర్హత కలిగి ఉంటుంది.
- రైతు కుటుంబాన్ని నిర్ణయించడానికి పౌరసరఫరాల శాఖ జారీ చేసిన ఆహార భద్రత కార్డు డేటాబేసను ప్రామాణికంగా తీసుకుంటారు.
- కుటుంబ యజమాని, జీవిత భాగస్వామి, వారిపై ఆధారపడి ఉన్న పిల్లలను ఒక కుటుంబంగా పరిగణిస్తారు.

**రుణమాఫీ పథకాన్ని అమలు చేస్తారిలా..**

- రుణమాఫీ మొత్తాన్ని డీబీటీ (నగదు బదిలీ) పద్ధతిలో నేరుగా లబ్ధిదారులైన రైతు రుణ ఖాతాలకు జమ చేస్తారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లో ఉన్న రుణమాఫీ మొత్తాన్ని డీసీసీబీలకు గానీ, వాటి పరిధిలోని బ్రాంచిలకుగానీ విడుదల చేస్తారు. ఆ బ్యాంకర్లు రుణమాఫీ మొత్తాన్ని వారి పరిధిలో ఉన్న రైతుల ఖాతాల్లో జమ చేస్తారు.
- ప్రతి రైతు కుటుంబానికి 2023 డిసెంబరు 9 నాటికి ఉన్న మొత్తం రుణం ఆధారంగా ఆరోహణ క్రమంలో మాఫీ సొమ్మును జమ చేస్తారు. మొత్తం రుణం గానీ, లేక రూ.2 లక్షల వరకు గానీ.. ఏది తక్కువైతే ఆ మొత్తాన్ని రైతు కుటుంబం పొందే అర్హత ఉంటుంది.
- రూ.2 లక్షలకు మించి రుణం ఉంటే.. ఆ రైతు రూ.2 లక్షలకు పైబడి ఉన్న రుణాన్ని మొదట బ్యాంకులకు చెల్లించాలి. ఆ తర్వాత అర్హత కలిగిన 2 లక్షల మొత్తాన్ని రుణ ఖాతాకు బదిలీ చేస్తారు.
- రూ.2 లక్షల కంటే ఎక్కువ రుణం ఉన్న పరిస్థితుల్లో.. కుటుంబంలో రుణం తీసుకున్న మహిళల రుణాన్ని మొదట మాఫీ చేసి, మిగులు మొత్తాన్ని దామాషా పద్ధతిలో కుటుంబంలో పురుషుల పేరు మీద తీసుకున్న రుణాలను మాఫీ చేస్తారు.

**పథకం అమలుకు ఏర్పాట్లు, కసరత్తు, షరతులు..**

- వ్యవసాయశాఖ కమిషనర్/డైరెక్టర్‌ను పంట రుణమాఫీ- 2024 పథకాన్ని అమలు చేసే అధికారిగా ప్రభుత్వం నిర్ణయించింది.
- హైదరాబాద్‌లోని నేషనల్ ఇన్‌ఫర్మేటిక్ సెంటర్(ఎన్ఐసీ) ఈ పథకానికి ఐటీ భాగస్వామిగా బాధ్యతలు నిర్వర్తిస్తుంది.
- వ్యవసాయశాఖ డైరెక్టర్, ఎన్ఐసీ సంయుక్తంగా ఈ పథకం అమలు కోసం ఒక ఐటీ పోర్టల్‌ను నిర్వహిస్తారు. ఈ పోర్టల్‌లో ప్రతి రైతు కుటుంబానికి సంబంధించిన లోన్ అకౌంట్ డేటా సేకరణ, డేటా వ్యాలిడేషన్, అర్హత మొత్తాన్ని నిర్ణయించడానికి సౌకర్యం ఉంటుంది. ఈ పోర్టల్‌లో ఆర్థిక శాఖ నిర్వహించే 'ఐఎఫ్ఎంఐఎస్' పోర్టల్‌కు బిల్లుల సమర్పణ, పథకానికి సంబంధించిన భాగస్వాములందరితో సమాచారాన్ని పంచుకోవడం, రైతులు ఇచ్చే ఫిర్యాదుల పరిష్కారానికి మాడ్యూల్స్ ఉంటాయి.
- ఈ పథకం అమలు కోసం ప్రతి బ్యాంకులో ఒక అధికారిని 'బ్యాంకు నోడల్ అధికారి'(బీఎన్‌వో)గా నియమిస్తారు. ఈ నోడల్ అధికారి.. బ్యాంకులకు, వ్యవసాయశాఖ డైరెక్టర్, ఎన్ఐసీ మధ్య సమన్వయకర్తగా వ్యవహరిస్తారు.
- రుణమాఫీ పొందటానికి రైతులు తప్పుడు సమాచారం ఇచ్చినా, మోసపూరితంగా పంట రుణాన్ని పొందినా, పథకానికి అర్హులు కాదని తేలినా.. రుణమాఫీ మొత్తాన్ని తిరిగి ప్రభుత్వానికి చెల్లించాల్సి ఉంటుంది. దీనిని రికవరీ చేసే అధికారం వ్యవసాయశాఖ డైరెక్టర్‌కు ఉంటుంది.
- రైతుల సందేహాలు, ఇబ్బందులను పరిష్కరించడానికి వ్యవసాయ శాఖ డైరెక్టర్ ఒక పరిష్కార విభాగాన్ని ఏర్పాటు చేస్తారు. రైతులు తమ ఇబ్బందులను ఐటీ పోర్టల్ లేదా మండల స్థాయిలో స్థాపించిన సహాయ కేంద్రాల వద్ద తెలిపే అవకాశం కల్పించారు. ప్రతి అభ్యర్థనను 30 రోజుల్లోపు పరిష్కరించి దరఖాస్తుదారునికి తెలపాలి.

**రుణమాఫీ వీటికి వర్తించదు..**

- రుణమాఫీ పథకం.. స్వయం సహాయక సంఘాల (ఎస్‌హెచ్‌జీల)కు, జాయింట్ లయబిలిటీ గ్రూప్ (జేఎల్‌జీ)లు, రిసోర్స్ మేనేజ్‌మెంట్ గ్రూప్ (ఆర్ఎంజీ)లు, లోన్ ఎలిజిబిలిటీ కార్డ్ స్కీం (ఎల్ఐసీఎస)లకు తీసుకున్న రుణాలకు వర్తించదు.
- పునర్వ్యవస్థీకరించిన లేదా రీషెడ్యూలు చేసిన రుణాలకు రుణమాఫీ పథకం వర్తించదు. ప్రకృతి విపత్తులు సంభవించి.. రైతులకు తీరని నష్టం కలిగినపుడు ఆ ప్రాంతంలో రైతులు తీసుకున్న పంట రుణాలపై ప్రభుత్వ మారిటోరియం ప్రకటిస్తే అది రీషెడ్యూలు కిందకు వస్తుంది. అప్పుడా రుణాలు స్వల్పకాలం నుంచి దీర్ఘకాలిక రుణాల జాబితాలోకి వెళ్తాయి.
- కంపెనీలు, ఫర్మ్‌లు వంటి సంస్థలకు ఇచ్చిన పంట రుణాలకు వర్తించదు. పీఏసీఎసల ద్వారా తీసుకున్న పంట రుణాలకు వర్తిస్తుంది.
- కేంద్రం అమలు చేసే పీఎం-కిసాన్ మినహాయింపులను రాష్ట్ర ప్రభుత్వం వద్ద ఉన్న డేటా లభ్యత మేరకు.. ఆచరణాత్మకంగా అమలు చేయడానికి వీలైనంత వరకు పరిగణనలోకి తీసుకుంటారు.

# డీఎస్సీ రద్దు కుదరదు..

హైదరాబాద్, (నేటి ఫోకస్ న్యూస్), జూలై 15:

ప్రభుత్వంలో పేపర్ లీకేజీలతో విద్యార్థులు తీవ్రంగా నష్టపోయారని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. రాష్ట్ర ప్రజలు, నిరుద్యోగ , యువతీ యువకులకు భట్టి విక్రమార్క విజ్ఞప్తి చేశారు. రాష్ట్రం తెచ్చుకుంది ఉద్యోగాలకోసమని తెలిపారు. అనేక ఉద్యమాలు, విద్యార్థుల ఆత్మబలిదానాల ఫలితం తెలంగాణ రాష్ట్రం సిద్ధించిందని చెప్పారు. అందుకే తమ ప్రభుత్వం ఉద్యోగాలపై దృష్టి పెట్టి 30వేల ఉద్యోగాలు భర్తీ చేసిందని వెల్లడించారు. విద్యా వ్యవస్థ బలోపేతం, పేద విద్యార్థులకు మంచి విద్యానందించాలని డీఎస్సీ ప్రకటించామని తెలిపారు. ఈరోజు( ఆదివారం) గాంధీభవన్‌లో భట్టివిక్రమార్క మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్‌పై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం నిరుద్యోగులను గాలికి వదిలేసిందని మండిపడ్డారు. పదేళ్లు డీఎస్సీని ఎందుకు నిర్వహించలేదని ప్రశ్నించారు. ఎన్నికలకు ముందు నోటిఫికేషన్ విడుదల చేసి ఓట్లకోసం తాపాత్రయ పడ్డారని విమర్శించారు. 5వేల నోటిఫికేషన్లు ఇచ్చి పరీక్షలు నిర్వహించకపోవడంతో తమ ప్రభుత్వం రాగానే 11వేలకు పైగా పోస్టులతో నోటిఫికేషన్ ఇచ్చామని గుర్తుచేశారు. 16వేల టీచర్ పోస్టులుఖాళీగా ఉన్నట్టు గుర్తించామని, 19,718 టీచర్ల ప్రమోషన్లు, బదిలీలు చేపట్టామని వివరించారు. ఇప్పటికే అభ్యర్థులు హాల్ టికెట్లు 2లక్షల 500కు పైగా డౌన్ లోడ్ చేసుకున్నారని వివరించారు. మొత్తం 2లక్షల 79వేలమంది దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. కొంతమంది పోస్ట్‌పోన్ చేయమని ధర్నాలు చేస్తున్నారని అలా చేయడం తగదని దీనివల్ల అభ్యర్థులు నష్టపోతారని ఆవేదన వ్యక్తం చేశారు. తమ ప్రభుత్వం రాగానే గ్రూప్ 1పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేసి పరీక్షలు నిర్వహించి రిజల్ట్ ప్రకటించామని గుర్తుచేశారు. గత ప్రభుత్వంలో పేపర్ లీకేజీలతో నిరుద్యోగ యువకులు నష్టపోయిన విషయాన్ని గుర్తించామని అన్నారు. గ్రూప్ 2 కూడా గత ప్రభుత్వం మూడు సార్లు పోస్ట్ ఫోన్ చేసిందని గుర్తుచేశారు. తమ ప్రభుత్వం మళ్లీ పరీక్షలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామని తెలిపారు. గ్రూప్ 3 కూడా నిర్వహించలేకపోతే మళ్లీ తాము షెడ్యూల్ చేశామని అన్నారు. ఇవన్నీ నిరుద్యోగులకు నష్టం కలగొద్దని తమ ప్రయత్నమని వివరించారు. ఇవి కాక వివిధ శాఖల్లో పోస్టులు 13321 టీజీపీఎస్సీ ఆధ్వర్యంలో భర్తీ చేస్తున్నామని తెలిపారు. డీఎస్సీని కూడా పకడ్బందీగా నిర్వహిస్తామని తెలిపారు. మరో డీఎస్సీ నిర్వహించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని వివరించారు. త్వరలోనే పోస్టుల సంఖ్యతో నోటిఫికేషన్ విడుదల చేస్తామని ప్రకటించారు. అందరూ మంచిగా ప్రిపేరై ఉద్యోగాలు సాధించి విద్యార్థులకు మంచి విద్యను అందించాలని కోరుతున్నామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పేర్కొన్నారు.

# సచివాలయ ముట్టడి ఉద్రిక్తం..

హైదరాబాద్, (నేటి ఫోకస్‌న్యూస్), జూలై 15:

గ్రూప్ 2,3 పోస్టులను పెంచాలని.. గ్రూప్-2, డీఎస్సీ పరీక్షలు వాయిదా వేయాలని పలు సంఘాలు.. స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని ఏఐఎస్ఎఫ్ నేతలు చేపట్టిన సచివాలయ ముట్టడి ఉద్రిక్తతకు దారితీసింది. సోమవారం ఉదయం 11.30 గంటల ప్రాంతంలో సచివాలయ ముట్టడికి యత్నించిన ఏఐఎస్ఎఫ్ విద్యార్థులను పోలీసులు అడ్డుకున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి వెంటనే ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు, స్కాలర్‌షిప్ బకాయిలు విడుదల చేయాలని ఏఐఎస్ఎఫ్ నేతలు డిమాండ్ చేశారు.

సమగ్ర కుల గణన జరిపి బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని, మెగా డీఎస్సీ వేయాలని, గ్రూప్-2, 3 పోస్టులను పెంచాలని డిమాండ్ చేస్తూ బీసీ కులాలు, బీసీ సంఘాల ఐక్య వేదిక, బీసీ జన సభ, విద్యార్థి నిరుద్యోగ సమాఖ్య, హిందూ బీసీ మహాసభ, ఆలిండియా ఓబీసీ జేఏసీ, బీఆర్ఎస్వీ నేతలు నల్లపోచమ్మ దేవాలయం నుంచి మీడియా పాయింట్ మీదుగా సచివాలయం వైపు దూసుకొచ్చారు. దీంతో పోలీసులు వారిని అరెస్టు చేశారు. అడ్డుకున్నారు. సచివాలయ ముట్టడికి మద్దతు పలికిన బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్యను సోమవారం ఉదయమే పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు.

డీఎస్సీ వాయిదా వేయాలని ధర్నా..

చిక్కడపల్లి సిటీ లైబ్రరీ వద్ద నిరుద్యోగులు సాయంత్రం మెరుపు ఆందోళనకు దిగారు. తొలుత అభ్యర్థులంతా లైబ్రరీ నుంచి ఆర్టీసీ క్రాస్ రోడ్స్ మీదుగా శాంతి ర్యాలీ తీసేందుకు యత్నించగా.. పోలీసులు అడ్డుకున్నారు. లైబ్రరీ నుంచి ఎవరూ బయటకు రాకుండా గేటుకు తాళం వేశారు. దీంతో నిరుద్యోగులంతా అక్కడే బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినదించారు. నిరుద్యోగుల ఆందోళన నేపథ్యంలో పెద్దఎత్తున ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ దిగింది. దీంతో నిరుద్యోగులంతా లైబ్రరీ లోపలికి పరుగులు తీశారు. ఓసారి పోలీసులు ముందుకు రావడం.. మరోసారి వెనక్కి వెళ్లడం.. ఇదే క్రమంలో నిరుద్యోగులు వెనక్కి, ముందుకు పరుగులు తీశారు. రెండు గంటలకు పైగా ఆందోళన కొనసాగింది. లైబ్రరీ గేటు దాటి వచ్చిన దాదాపు 20 మందిని పోలీసులు అరెస్టు చేశారు. డీఎస్సీ వాయిదా వేయాలని నిరుద్యోగులు దిల్‌సుఖ్‌నగర్‌లోని కమల ఆస్పత్రి ముందు సోమవారం రాత్రి ధర్నా చేశారు.

# ప్రభుత్వాన్ని కూల్చుతామంటే చూస్తూ ఊరుకోం

కరీంనగర్, (నేటి ఫోకస్ న్యూస్), జూలై 15: భవిష్యత్తు తరాలు ఆరోగ్యంగా ఉండాలంటే మొక్కలు నాటాలని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. కరీంనగర్‌లోని శాతవాహన యూనివర్సిటీలో నిర్వహించిన వన మహోత్సవం కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. జిల్లాల్లో 43 లక్షల మొక్కలు నాటేందుకు లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. ప్రతి ఒక్కరూ విధిగా మొక్కలు నాటాలని సూచించారు. ఈ అలవాటు అందరి జీవితంలో భాగం కావాలని కోరారు. "ప్రభుత్వం మొక్కలు పంపిణీ చేస్తోంది. ఎన్ని చేసినా ప్రజల సహకారం కావాలి. కాలుష్యం తగ్గి వ్యాధులు దరి చేరకుండా ఉండాలంటే అందరూ దీనిపై దృష్టి సారించాలి. ప్రతి మొక్కకూ జియో ట్యాగింగ్ చేయాలి. ఇది ప్రభుత్వ కార్యక్రమంగా కాకుండా ప్రజల కార్యక్రమంగా, సామాజిక బాధ్యతతో వ్యవహరించాలి.



**ప్రభుత్వ సుస్థిరత కోసమే చేరికలు..:** భాజపా ఇప్పటివరకు ఎన్నో ప్రభుత్వాలను కూల్చింది. ప్రభుత్వాన్ని కూల్చుతామంటే చూస్తూ ఊరుకోవాలా? డిసెంబర్ 3 వరకు ఇతర పార్టీల ఎమ్మెల్యేలను చేర్చుకునే ఆలోచనే లేదు. ప్రభుత్వాన్ని కూల్చుతామని మీరంటుంటే.. నిలబెట్టడానికి వారు వస్తున్నారు. మేం ధర్మం తప్పలేదు.. ప్రభుత్వ సుస్థిరత కోసమే చేరికలు. కులగణనపై మరో రెండు రోజుల్లో నిర్ణయం తీసుకుంటాం" అని పొన్నం ప్రభాకర్ తెలిపారు.

# బీఆర్ఎస్ వికెట్ నంబర్ పది..



(మొదటి పేజీ తరువాయి..)

ముఖ్యంగా గ్రేటర్ హైదరాబాద్ పరిధి నుంచి మరిన్ని చేరికలపై ఫోకస్ పెట్టినట్లు తెలుస్తోంది. అందులో భాగంగానే ఇవాళ పటాన్ చెరు బీఆర్ఎస్ ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. మహిపాల్‌రెడ్డి 2014 నుంచి వరుసగా మూడుసార్లు గులాబీ పార్టీ నుంచి గెలుపొందారు. మరో బీఆర్ఎస్ నేత, జహీరాబాద్ ఎంపీగా పోటీ చేసి ఓడిపోయిన గాలి అనిల్‌కుమార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. జూబ్లీహిల్స్‌లోని సీఎం నివాసంలో వీరు తమ అనుచరులతో హస్తం కండువా కప్పుకున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమక్షంలో మహిపాల్ రెడ్డి, గాలి అనిల్ కుమార్‌లు హస్తం గూటికి చేరారు. మరికొందరు ముఖ్యంగా గ్రేటర్ హైదరాబాద్ నుంచి పలువురు త్వరలో కాంగ్రెస్ పార్టీలో చేరనున్నట్టు విస్తృతంగా ప్రచారం జరుగుతోంది. బీఆర్ఎస్ వికెట్ నంబర్ 10 : చేరికల సందర్భంగా మంత్రులు పొంగులేటి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, దామోదర రాజనర్సింహ, మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి, ఖైరతాబాద్ డీసీసీ అధ్యక్షుడు రోహిన్ రెడ్డి, నీలం మధు, శశికళా యాదవ్ తదితరులు హాజరయ్యారు. మహిపాల్‌రెడ్డి చేరికతో కాంగ్రెస్‌లో చేరిన గులాబీ పార్టీ ఎమ్మెల్యేల సంఖ్య పదికి చేరింది. తెల్లం వెంకట్రావ్, దానం నాగేందర్, కడియం శ్రీహరి పార్లమెంటు ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీలో చేరారు. సార్వత్రిక ఎన్నికల అనంతరం పోచారం శ్రీనివాస్‌రెడ్డి, డాక్టర్ సంజయ్‌కుమార్, బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి కాలె యాదయ్య, ప్రకాశ్‌గౌడ్, అరికెపూడి గాంధీ కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. వీరందరిని కలుపుకొని కాంగ్రెస్ బలం 75కి పెరిగింది. సీపీఐతో కలిపి 76కు చేరుకుంది. బీఆర్ఎస్ బలం 28కి పడిపోయింది. శాసనసభలో బీజేపీకి 8 మంది, ఎంఐఎం పార్టీకి 7 మంది ఎమ్మెల్యేలు సభ్యులు ఉన్నారు.





# మహిళలు స్వశక్తితో ఎదగాలి

## కాంగ్రెస్ మహిళా నాయకుల సమావేశంలో మహిళలతో ఆత్మీయంగా ఎమ్మెల్యే శ్రీ గణేష్

ఫోకస్ న్యూస్, (సికింద్రాబాద్ కంటోన్మెంట్)-జూలై 15:
మహిళలందరూ స్వసక్తితో ఎదిగేందుకు, సహకరిస్తారని ఎమ్మెల్యే శ్రీ గణేష్ అన్నారు. సోమవారం నాడు కంటోన్మెంట్ నియోజకవర్గం కాక గూడ అప్ బస్తి మహిళా కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సమావేశానికి ఎమ్మెల్యే శ్రీ గణేష్ హాజరయ్యారు. ఎమ్మెల్యే శ్రీ గణేష్ మాట్లాడుతూ... మీ మహిళలందరూ ఆశీర్వదించి నాకు సహకరించి నన్ను గెలిపించి, మీ అందరికీ సేవ చేసే అవకాశం కల్పించినందుకు మీ అందరికీ పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. మీ అందరిని ఈ సమావేశంలో కలవడం చాలా సంతోషంగా ఉంది అని, మీరు చెప్పిన సమస్యలన్నింటిని మన ప్రజా పాలన మన కాంగ్రెస్ ప్రభుత్వంతో మాట్లాడి పరిష్కరించే విధంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కొంత మంది ఆకతాయిలు బస్తీలో గంజాయి కొడుతూ ఇబ్బంది పెడుతున్నారని మహిళలు అందరు చెప్పడంతో వెంటనే స్థానిక ఏఎస్ఐ వారి పైన తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం బస్తీలో పర్యటించి సమస్యలు అడిగి తెలుసుకున్నరు. ఈ కార్యక్రమంలో శ్యామల, తిరుమల, రజిని, పద్మ, రేపల్లె వెంకటేశ్వర్లు, మరియు బస్తి మహిళలందరూ పాల్గొన్నారు.

## పార్టీ ఫిరాయింపులపై ఉన్న ఉత్సాహం

# ప్రజా పాలనపై లేదు

### టీటీడీపీ బీసీ సెల్ స్టేట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ పోగుల సైదులు గౌడ్

మిర్యాలగూడ ప్రతినిధి, (నేటి ఫోకస్‌న్యూస్)-జూలై 15:



తెలంగాణలో 10సంవత్సరాల నియంతృత్వ పాలనపై విసుకు చెంది కాంగ్రెస్ ఇచ్చిన హామీలకు గాను ప్రజలు అధికారం ఇస్తే ఇచ్చిన హామీలను, ప్రజాక్షేమం, పరిపాలనను నిర్లక్ష్యం చేస్తూ పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించడానికి తెలుగుదేశం పార్టీ బీసీ విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పోగుల సైదులు గౌడ్ వ్యతిరేకించారు. చాలా కాలంగా బీసీలు హక్కులకై పోరాటాలు చేస్తుంటే కులగలను చేపట్టి జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కేటాయించి స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహిస్తామని హామీ ఇచ్చి మరచిపోయి, విద్యార్థుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చి నిర్లక్ష్యం చేసి, నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించి జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని ఇచ్చిన హామీలను గాలికి వదిలేసి, కులగన్న చేపట్టకుండా స్థానిక సమస్య ఎన్నికల్లోకి వెళ్లడానికి చూడాలని విద్యార్థుల సమస్యలు ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలను చెల్లించకపోవడాన్ని నిరుద్యోగులకు జాబ్ కార్నర్లు విడుదల చేయకపోవడం, ప్రజలందరూ గమనిస్తున్నారని తెలుగుదేశం పార్టీ ప్రజా సమస్యలపై పోరాడుతుందన్నారు. హామీలు నెరవేర్చకుండా స్థానిక సంస్థల ఎలక్షన్లకు వెళితే తగిన బుద్ధి చెప్పడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని పార్టీ ఫిరాయింపులపై కాకుండా ప్రజా సమస్యలపై ప్రభుత్వం పని చేయాలని హితవు పలికారు. లేకపోతే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు.




## నిరుద్యోగుల సమస్యలు

# పరిరక్షించాలి

### బీసీ యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తిరుమలగిరి అశోక్ అరెస్ట్

మిర్యాలగూడ ప్రతినిధి, (నేటి ఫోకస్‌న్యూస్)-జూలై 15:
నిరుద్యోగుల సమస్యలు పరీక్షించాలని డిమాండ్ చేస్తూ నేడు బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్ కృష్ణయ్య ముట్టడికి పిలుపునిచ్చిన సందర్భంగా మిర్యాలగూడ బీసీ యువజన సంఘం నాయకులను అదుపులోకి తీసుకున్న పోలీసులు, ఈ సందర్భంగా బీసీ యువజన సంఘం తెలంగాణ రాష్ట్ర ప్రెసిడెంట్ తిరుమలగిరి అశోక్ మాట్లాడుతూ నూతన ప్రభుత్వం ఏర్పాటై నేటికీ 8 నెలలు గడిచినప్పటికీ నిరుద్యోగుల నుండి తీవ్రస్థాయి వ్యతిరేకత కనిపిస్తుందని ఆయన అన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దాన ప్రకారం నిరుద్యోగులకు పూర్తిస్థాయిలో ఉద్యోగ అవకాశాలు కల్పించాలని అలాగే గ్రూప్2, గ్రూప్3 పరీక్ష నిర్వహించి వెంటనే డీఎస్సీ వేస్తామని ప్రకటిస్తే నిరుద్యోగులు చదువుకుని అవకాశం ఎక్కడ ఉందని ఆయన ప్రశ్నించారు. నామమాత్రపు ప్రకటనలు చేయడం కాదు, నిరుద్యోగులతో చర్చలు జరిపి జాబ్ క్యాలెండర్ రిలీజ్ చేయాలని ఆయన అన్నారు. గత ప్రభుత్వం కూలిపోవడానికి నిరుద్యోగులు చేసిన ఉద్యమం నేటి ప్రభుత్వ మర్చిపోకూడదని ఆయన హెచ్చరించారు. ప్రభుత్వం సానుకూలంగా స్పందించి నిరుద్యోగుల ఆశలకు గండి కొట్టకుండా చర్యలు తీసుకోవాలన్నారు. జాబ్ క్యాలెండర్ విడుదల చేసి తద్వారా పరీక్షలు నిర్వహించాలని ఆయన కోరారు. అరెస్ట్ అయినవారిలో రాయించు నరసింహ, చిలకల మురళి యాదవ్, నరేష్, గంగాధర్, ఉపేందర్ తదితరులు ముఖ్య నాయకులను అదుపు లోకి తీసుకున్నారు.






# సదా శివమయం

నేటి ఫోకస్ న్యూస్ ప్రతినిధి, (స్టేట్ కోఆర్డినేటర్)-జూలై 15:
సదాశివపేట పట్టణంలో చౌకీమఠం, బసవ సేవా సదన్ లో నిర్వహించబడుతున్న శివ పంచాక్షరి కోటి జప యజ్ఞం సామూహిక ఇష్ట లింగా అర్చన మహోత్సవంలో భాగంగా మూడవరోజు శివపంచాక్షరి మంత్రముతో సదాశివపేట శివమయంగా మారిందని శ్రీ కాశీ జ్ఞాన సింహాసనాదీశ్వర జగద్గురువులు 1008 డాక్టర్ చంద్రశేఖర శివాచార్య మహాస్వామి అన్నారు. మూడవ రోజు కార్యక్రమంలో భాగంగా జగద్గురువుల సాన్నిధ్యంలో ఉదయము సామూహిక ఇష్ట లింగార్చన కార్యక్రమంలో భాగంగా రుద్ర నమక చమకాలతో ఇష్ట లింగ అభిషేకం మరియు జగద్గురువుల పాదపూజ నిర్వహించడం జరిగిందని. వీరశైవ సమాజం చౌకి మఠం అధ్యక్షులు చీల మల్లన్న అన్నారు. నాలుగు వేదాలలో ఉన్నటువంటి మంత్రాలన్నింటిలోనూ శివ పంచాక్షరి మంత్రం ఎంతో గొప్పదని ఆ యొక్క గొప్ప మంత్రాన్ని సదాశివపేటలో కోటి జపయజ్ఞంగా చేయడం గొప్ప మహాభాగ్యం అని జగద్గురువులు సందేశాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో పూజా కార్యక్రమంలో పాల్గొంటున్నటువంటి భక్తులందరికీ జగద్గురువుల పాద దర్శనము మరియు అన్నప్రసాదము అందజేస్తున్నట్లు సమాజం ప్రధాన కార్యదర్శి పిల్లోడే విశ్వనాథం అన్నారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు బోడగామా శ్రీశైలం మరియు కార్యవర్గ సభ్యులు భక్తులు పాల్గొన్నారు.






# అంగన్వాడి బాట ర్యాలీ

మాడుగులపల్లి, (నేటి ఫోకస్‌న్యూస్)-జూలై 15:
ప్రభుత్వ ఆదేశానుసారం 15 నుండి 20వ తేదీ వరకు నిర్వహించనున్న అమ్మ మాట అంగన్వాడి బాట కార్యక్రమాన్ని మండలంలోని పలు గ్రామాల అంగన్వాడి టీచర్లు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 3 నుండి 6 సంవత్సరాల పిల్లలను అంగన్వాడీ కేంద్రంలో చేర్పించాలని అన్నారు. పిల్లలకు పౌష్టికాహారం అందజేస్తున్నట్లు తెలిపారు ఈ కార్యక్రమంలో టీచర్లు ఆయాలు పాల్గొన్నారు.



# డ్రగ్స్ విక్రయ ముఠా అరెస్ట్

◆ ఐదురుగిరి అరెస్ట్.. మరో ఇద్దరు పరారీ

హైదరాబాద్, (నేటి ఫోకస్ న్యూస్), జూలై 15:
డ్రగ్స్ విక్రయ ముఠాను హైదరాబాద్ పోలీసులు అరెస్టు చేశారు. రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో భారీగా డ్రగ్స్ స్వాధీనం చేసుకున్నారు. ఐదుగురిని అరెస్టు చేయగా.. మరో ఇద్దరు పరారీలో ఉన్నట్లు డీసీపీ శ్రీనివాస్ మీడియాకు వెల్లడించారు. అరెస్టయిన వారిలో ఇద్దరు నైజీరియన్లు కూడా ఉన్నట్లు తెలిపారు. రూ.35 లక్షల విలువైన 199 గ్రాముల కొకైన్‌తోపాటు, రెండు పాస్‌పోర్టులు, 10 ఫోన్లు, 2 బైకులను సీజ్ చేశామన్నారు. నిందితులను ఒనౌహా బ్లెస్సింగ్, అజీజ్ నోహీం, వెంక గౌతమ్, వరుణ్ కుమార్, మహ్మద్ షరీఫ్‌లుగా గుర్తించారు. పరారీలో ఉన్న ఇద్దరి గురించి సమాచారం ఇస్తే రూ.2 లక్షల రివార్డు ఇస్తామని డీసీపీ ప్రకటించారు. 'అనౌహా లబెస్సింగ్ ఇక్కడికి డ్రగ్స్ తీసుకొచ్చి విక్రయిస్తుంది. ఇప్పటి వరకు ఆమె 20సార్లు నైజీరియా నుంచి హైదరాబాద్‌కు డ్రగ్స్ తీసుకొచ్చినట్లు గుర్తించాం. ఆమె దగ్గర 13 మంది డ్రగ్స్ కొనుగోలు చేసినట్టు గుర్తించాం. వారిలో ఆరుగురికి కొకైన్ టెస్టులో పాజిటివ్ వచ్చింది. వీరిపైనా కేసులు నమోదు చేశాం. పాజిటివ్‌గా తేలిన వారిలో అమన్ ప్రీత్‌సింగ్, అంకిత్, ప్రసాద్, నిఖిల్ తదితరులు ఉన్నారు ' అని డీసీపీ వివరించారు.

# యాదాద్రిలో గిరి ప్రదక్షిణం

◆ భారీగా హాజరైన భక్తులు

యాదగిరిగుట్ట, (నేటి ఫోకస్‌న్యూస్), జూలై 15:
యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో సోమవారం గిరి ప్రదక్షిణ నిర్వహించారు. స్వామి జన్మనక్షత్రం స్వాతి సందర్భంగా చేపట్టిన ఈ కార్యక్రమంలో భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు. తొలుత వైకుంఠ ద్వారం వద్ద స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య పూజలు చేసి ప్రదక్షిణలో పాల్గొన్నారు. ఆలయ ఈవో భాస్కరరావు, ధర్మకర్త నరసింహమూర్తి, వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్త బృందాలు పాల్గొన్నాయి. మరోవైపు యాదాద్రి క్షేత్రం గర్భాలయంలోని మూలవరులకు సోమవారం ఉదయం అష్టోత్తర శత ఘటాభిషేకం నిర్వహించారు. ఈ విశేష క్రతువును వేదమంత్రోచ్ఛరణల మధ్య చేపట్టారు.

# కోడికత్తి కేసులో బెయిల్ రద్దు చేయలేం: సుప్రీం

న్యూఢిల్లీ, (నేటి ఫోకస్ న్యూస్), జూలై 15:
కోడికత్తి కేసులో నిందితుడు శ్రీనివాసరావు బెయిల్ రద్దు చేసేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. ఏపీ హైకోర్టు మంజూరు చేసిన బెయిల్ ఉత్తర్వులపై జోక్యానికి అత్యున్నత న్యాయస్థానం అంగీకరించలేదు. 2019 ఎన్నికలకు ముందు విశాఖ విమానాశ్రయంలో అప్పటి ప్రతిపక్ష నేత జగన్‌పై శ్రీనివాసరావు కోడికత్తితో దాడి చేశాడు. ఈ కేసును దర్యాప్తు చేసిన ఎన్ఐఏ.. నిందితుడిని అరెస్ట్ చేసింది. సుమారు ఐదేళ్లు జైల్లో ఉన్న శ్రీనివాసరావుకు హైకోర్టు బెయిల్ మంజూరు చేసింది. దీన్ని రద్దు చేయాలంటూ ఎన్ఐఏ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. దీనిపై విచారణ జరిపిన సుప్రీంకోర్టు ధర్మాసనం బెయిల్ రద్దుకు నిరాకరించింది.

# కాశీలో క్యూఆర్ కోడ్ అమలు

◆ ప్రవేశానికి అధికారులు ఏర్పాట్లు

వారణాసి, (నేటి ఫోకస్‌న్యూస్), జూలై 15:
ప్రఖ్యాత కాశీ విశ్వనాథ ఆలయాన్ని దర్శించే యాత్రికులకు మరింత సులభంగా ఆలయ ప్రవేశానికి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందులో భాగంగా క్యూఆర్ కోడ్ ఆధారిత గుర్తింపు కార్డుతో ఆలయం ఆవరణలోకి ప్రవేశం కల్పించనున్నారు. వీఐపీ దర్శనం, ప్రొటోకాల్ దర్శనం కోసం వచ్చేవారికే ఈ పద్ధతిలో ఎంట్రీ కల్పించనున్నారు. గత మార్చి నుంచి అధికారులు, ఉద్యోగులకు మాత్రమే ఈ వెసులుబాటు కల్పించగా ఇప్పుడు సాధారణ యాత్రికులకు కూడా ఈ అవకాశాన్ని విస్తరిస్తున్నారు. సౌకర్యాలను మెరుగుపరచడంలో భాగంగా పూర్తి స్థాయి డిజిటల్ సర్వీసులను అందించేందుకు ఆలయ అధికారులు సన్నాహాలు చేస్తున్నాయి. క్యూఆర్ కోడ్ ఆధారిత ఆర్ఎఫ్ఐడీ (రేడియా ఫ్రీక్వెన్సీ ఐడెంటిఫికేషన్) ద్వారా యాత్రికుల ప్రవేశానికి ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందుకోసం ఆర్ఎఫ్ఐడీ మెషీన్‌ను ఆలయం వద్ద ఇప్పటికే ఏర్పాటు చేశారు. శ్రీ కాశీ విశ్వనాథుని లోగోతో ఉండే ఈ ఐడెంటిఫికేషన్ కార్డును ఆలయ యంత్రాగం జారీ చేస్తుంది. యాత్రికులు ఐడీ కార్డుపై ఉన్న క్యూఆర్ కోడ్‌ను స్కానింగ్ చేసుకుని థామ్‌లోకి ప్రవేసించవచ్చు. కార్డు స్కాన్ కాగానే ప్రవేశద్వారాలు ఆటోమాటిక్‌గా తెరుచుకుంటాయి. ఈ పక్రియ ప్రారంభం కాగానే ఆలయాన్ని దర్శించే ప్రతి ఒక్కరి రికార్డులను భద్రం చేసే పని ఆలయ అధికారులు తేలికవుతుంది. ఆర్ఎఫ్ఐడీ మెషీన్లను ప్రవేశద్వారం, ఎగ్జిట్ పాయింట్ల వద్ద ఏర్పాటు చేస్తుండగా, ఈ మెషీన్లు క్యూఆర్ కోడ్‌లను స్కాన్ చేసి భక్తుల రాకపోకలకు వీలుకల్పిస్తాయి. 15 మీటర్ల దూరం నుంచి మెషీన్లు ఆర్ఎఫ్ఐడీ కార్డ్‌ను రీడ్ చేస్తాయి. కార్డులో ఉద్యోగుల వ్యక్తిగత సమాచారం, యాత్రికుల పేరు, చిరునామా, మొబైల్ నెంబర్ ఉంటాయి. రెగ్యులర్ యాత్రికులు ఏ గేటు నుంచైనా థామ్‌లోకి అడుగుపెట్టవచ్చు. అయినప్పటికీ కాశీ ప్రయాణికుల కోసం కాశీ గేట్‌ను నిర్మించారు.

# తిరుమల ఆర్జిత సేవా టిక్కెట్లు 18న విడుదల: టీటీడీ

తిరుమల, (నేటి ఫోకస్‌న్యూస్), జూలై 15:
తిరుమల శ్రీవారి ఆర్జిత సేవా, అంగప్రదక్షిణ తదితర సేవలకు సంబంధించి అక్టోబరు నెల కోటా టికెట్ల విడుదల తేదీలను తిరుమల తిరుపతి దేవస్థానం ప్రకటించింది. ఆర్జిత సేవా టికెట్లను జూలై 18న ఉదయం 10 గంటలకు ఆన్‌లైన్‌లో విడుదల చేయనున్నట్లు తెలిపింది. ఈ సేవా టికెట్ల ఎలక్ట్రానిక్ డిప్ కోసం జులై 20న ఉదయం 10 వరకు నమోదు చేసుకోవచ్చు. టికెట్లు పొందినవారు జులై 20 నుంచి 22వ తేదీ మధ్యాహ్నం 12 గంటలలోపు రుసుము చెల్లించాలని పేర్కొంది. కల్యాణోత్స వం, ఊంజల్ సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవా టికెట్లను జులై 22న ఉదయం 10 గంటలకు విడుదల చేయనున్నారు. వర్చువల్ సేవలు, వాటి దర్శన స్లాట్లకు సంబం ధించిన అక్టోబర్ నెల కోటాను జులై 22న మధ్యాహ్నం 3 గంటలకు విడుదల చేస్తారు. అంగప్రదక్షిణం టోకెన్లను జులై 23 ఉదయం 10 గంటలకు, శ్రీవాణి ట్రస్టు టికెట్లను జులై 23 ఉదయం 11 గంటలకు విడుదల చేయనున్నారు. వృద్ధులు, దివ్యాంగులు, దీర్ఘకాలిక వ్యాధులు కలిగిన భక్తులు శ్రీవారిని దర్శించుకునేందుకు వీలుగా ఇస్తోన్న ఉచిత ప్రత్యేక దర్శనం టోకెన్లను జులై 23 మ.3గంటలకు విడుదల చేస్తారు. అక్టోబర్ నెలకు సంబంధించి ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్ల కోటాను జులై 24న ఉ.10గంటలకు, గదుల కోటా అదే రోజు మ.3గంటలకు విడుదల చేయనున్నారు. తిరుమల-తిరుపతి శ్రీవారి కోటా ఉదయం 11 గంటలకు, నవనీత సేవ మధ్యాహ్నం 12 గంటలకు, పరకామణి సేవ మధ్యాహ్నం 1 గంటకు ఆన్‌లైన్‌లోనే విడుదల చేయనున్నారు.

# పీవీఆర్‌లో వర్షపు జల్లులు..

## భారీ వర్షంతో 'కల్కి' మూవీ రద్దు

ప్రభాస్ హీరోగా నటించిన 'కల్కి 2898 ఏడీ' వసూళ్ల వర్షం కురిపించడమే కాదు థియేటర్‌లోను వర్షం కురిపించింది. పంజాగుట్ట లోని పీవీఆర్ థియేటర్‌లో సినిమా చూద్దామని వెళ్లిన ఫ్యాన్స్, ప్రేక్షకుల కు చుక్కలు కనిపించాయి. బాక్సాఫీస్ బరిలో ఈ సినిమాకు వసూళ్ల వర్షం కురవడం కాదు... థియేటర్ లోపల నిజంగా వర్షం కురిసింది. దాంతో సినిమా చూస్తున్న ప్రేక్షకులు షాకయ్యారు. ఏం జరుగుతుందో తెలియక ఆందోళనకు గురి అయ్యారు. ఆ తర్వాత షో క్యాన్సిల్ కావడంతో తీరిగ్గా బయట పడ్డారు. ఆదివారం రాత్రి హైదరాబాద్‌లో కుండపోత వర్షం కురిసింది. ఆ వర్షం ప్రభావం 'కల్కి 2898 ఏడీ' సినిమాపై పడింది. నగరం నడిబొడ్డున ఉన్న పీవీఆర్ పంజాగుట్టకు వెళ్లిన ఆడియన్స్ ప్రభాస్ సినిమా పూర్తిగా చూడకుండానే వెను దిరిగారు. నగరంలో కురిసిన భారీ వర్షాలకు పీవీఆర్ పంజాగుట్ట థియేటర్ పైకప్పు డ్యామేజ్ అయ్యింది. దాంతో థియేటర్ లోపలకు వర్షపు నీరు కురిసింది. తమ మీద నీరు పడటంతో సినిమా చూస్తున్న ప్రేక్షకులకు ఏమీ అర్థం కాలేదు. చివరకు, ఆ షో క్యాన్సిల్ చేసి మధ్యలోనే ప్రేక్షకుల్ని బయటకు పంపించారు.







# ఆగస్టులో కిరణ్ అబ్బవరం, రహస్య గోరఖ్ పెళ్లి

నటుడు కిరణ్ అబ్బవరం, నటి రహస్య గోరక్ వివాహానికి ముహూర్తం ఖరారైంది. వచ్చే నెలలో వీరి పెళ్లి జరగనుంది. తనకు కాబోయే భర్త కిరణ్ అబ్బవరం పుట్టినరోజును పురస్కరించుకుని రహస్య ఈ విషయాన్ని బయటపెట్టారు. ఆయనకు బర్త్‌డే విషెస్ చెబుతూ ఇన్‌స్టాలో ఆసక్తికర పోస్ట్ పెట్టారు. 'రాజావారు రాణిగారు' సమయం నుంచి నిశ్చితార్థమైన నాటివరకూ వీరిద్దరూ కలిసి దిగిన పలు ఫొటోలు, వీడియోలతో స్పెషల్ వీడియో క్రియేట్ చేసి దాన్ని అభిమానులతో పంచుకున్నారు. 'హ్యాపీ బర్త్‌డే కిరణ్ అబ్బవరం. మరో 38 రోజుల్లో నిన్ను.. మై హస్బెండ్ అనేందుకు ఆశగా ఎదురుచూస్తున్నా' అని ఆమె క్యాప్షన్ జత చేశారు. 2019లో విడుదలైన 'రాజావారు రాణిగారు'తోనే కిరణ్ తెరంగేట్రం చేశారు. ఇందులో రహస్య కథానాయికగా నటించారు. రొమాంటిక్ డ్రామాగా రూపొందిన ఈ సినిమా ప్రేక్షకులను అలరించింది. ఆ మూవీ షూటింగ్‌లోనే ఇద్దరి మధ్య ఏర్పడిన స్నేహం.. ప్రేమగా మారినట్లు తెలుస్తోంది. మార్చిలో వీరి నిశ్చితార్థం జరిగింది. కిరణ్ ప్రస్తుతం 'క' కోసం వర్క్ చేస్తున్నారు. పాన్ ఇండియా ఫిల్మ్‌గా ఇది విడుదల కానుంది. సుజీత్, సందీప్ దీనికి దర్శకత్వం వహిస్తున్నారు. సోమవారం ఆయన పుట్టినరోజును పురస్కరించుకుని 'క' టీజర్ విడుదల చేశారు.

# నాలుగేళ్ల కిందట డ్యాన్స్‌పై ట్రోల్సా?

తన డ్యాన్స్‌ను ట్రోల్ చేస్తూ సోషల్ మీడియా వేదికగా ఓ నెటిజన్ పెట్టిన పోస్ట్‌పై నటి అనసూయ స్పందించారు. పారదర్శక, గౌరవప్రదమైన విమర్శలను తాను ఆహ్వానిస్తానని చెప్పారు. 'నా మానసిక ప్రశాంతతను దృష్టిలో ఉంచుకొని కొన్ని విషయాలపై స్పందించకూడదని నిర్ణయించుకున్నా. మహానటి సావిత్రమ్మకు నివాళిగా దాదాపు నాలుగేళ్లక్రితం ఓ ఈవెంట్‌లో నేనిచ్చిన ప్రదర్శనలోని కొన్ని డ్యాన్స్ మూమెంట్స్‌ను ట్రోల్ చేయడం.. వాటికి ఇలా అవమానకర రీతిలో విమర్శలు చేయడం బాధాకరం. ఇక్కడ నా గురించి చెప్పట్లేదు.. నివాళులకు సంబంధించిన విషయాల్లో ఇలా చేయడం ఆ గొప్ప వ్యక్తులను అవమానపర్చినట్లే..! మర్యాదపూర్వకమైన విమర్శలను నేను ఎప్పుడూ స్వాగతిస్తా. ఆ కార్యక్రమంలో నా మొత్తం ప్రదర్శన చూసిన తర్వాత మీరు ఒక నిర్ణయానికి రండి' అని ఎక్స్ (ట్విటర్)లో పోస్ట్ చేశారు. అనసూయ ప్రస్తుతం వరుస సినిమాల్లో యాక్ట్ చేస్తున్నారు. 'పుష్ప 2'తోపాటు 'ఫ్లాష్‌బ్యాక్', 'వోల్ఫ్' వంటి తమిళ చిత్రాల్లో కీలక పాత్రలు పోషిస్తున్నారు.



# వైవిధ్యంగా 'తంగలాన్' చిత్రీకరణ

కథానాయకుడు చియాన్ విక్రమ్ ఎంపిక చేసుకునే పాత్రలు చాలా వైవిధ్యంగా ఉంటాయి. ప్రస్తుతం తంగలాన్ చిత్రంతో ప్రేక్షకుల ముందుకు వస్తున్నారు. కాలా, కబాలి వంటి సినిమాలు రూపొందించిన దర్శకుడు పా.రంజిత్ దర్శకత్వంలో విక్రమ్ కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం తంగలాన్. ఈ చిత్రాన్ని పా.రంజిత్ తనదైన శైలిలో అందరూ అబ్బుర పడేలా చిత్రీకరించారని యూనిట్ వర్గాలు చెప్పారు. ఇక విడుదలైన ఈ థియేట్రికల్ ట్రైలర్ చూస్తుంటే తప్పకుండా ఈ చిత్రాన్ని థియేటర్‌లో ఎక్స్‌పీరియన్స్ చేయాల్సిన సినిమాలా అనిపిస్తుందని అంటున్నారు విక్రమ్ అభిమానులు. తంగలాన్ బంగారు నిధుల నేపథ్యంలో యథార్థ సంఘటనలతో తీసిన చిత్రంలా కనిపిస్తుంది. విజువల్స్ ఆకట్టుకునే విధంగా వున్నాయి. మేకింగ్‌లో రిచ్‌నెస్, ప్రొడక్షన్ క్వాలిటీస్ కనిపిస్తున్నాయి. విక్రమ్ ఈ చిత్రంలో అటవి జాతికి చెందిన వీరుడిలాగా? ఇప్పటి వరకు కెరీర్‌లో పోషించనటువంటి వైవిధ్యమైన పాత్రలో కనిపిస్తున్నారు. ఈ పాత్ర కోసం ప్రత్యేక శ్రద్ధ తీసుకుని, కొన్నివారాల పాటు విక్రమ్ ఉపవాసాలు వున్నాడని తెలిసింది. ఈ పాత్ర కోసం విక్రమ్ చాలా హార్డ్ వర్క్ చేశారని తెలుస్తుంది. ఆయన చాలా బరువు తగ్గారు. ఇక ఈ ట్రైలర్‌లో ఆ అటవీ ప్రాంతంలో బంగారు నిధులు ఉన్నాయని బ్రిటీషర్లు గుర్తించి అక్కడి గిరిజన తెగ ప్రజలను సహాయం కోరుతారు.

